భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలి

- వరద నిర్వహణకు హైదరాబాద్ తరహాలోనే జిల్లాల్లో ఏర్పాట్లు
- ప్రకృతి విపత్తుల విభాగం బలోపేతానికి ఉన్నత స్థాయి కమిటీ
- వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలి
- నష్టం జరగకముందే స్పందించాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి, కృష్ణా నదుల పరివాహక ప్రాంతాల్లో వీలైనంత మేరకు ప్రాణ, ఆస్థి, ఆర్థిక నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలనీ, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. గోదావరి, కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లతో గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో గల తన ఛాంబర్‌లో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించే దానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్ర స్థాయిలో ప్రధానంగా వరద ప్రభావిత ప్రాంతాలలో చేపట్టవలసిన చర్యలు, విపత్తుల నిర్వహణా విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డీజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్ , కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్అండ్‌బి, ఆరోగ్య శాఖల కమిషనర్లతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ కమిటీ వారంలోగా ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో హఠాత్తుగా వచ్చే వర్షాల వల్ల ఊహించని వరదలు వస్తున్నాయనీ, గతానుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీవాహక ప్రాంతాల్లోని నివాసితులను గుర్తించి వారిని అక్కడి నుంచి శాశ్వతంగా తరలించాలనీ, వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విపత్తుల నిర్వహణ శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అన్ని శాఖలతో సమన్వయంతో పని చేయాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు, నిర్వహణ, ముందస్తు హెచ్చరికల కోసం అవసరమైన యూజర్ ఐడీలను ఇవ్వాలనీ, ఆయా జిల్లాల్లో పరిస్థితులను బట్టి వరదల కార్యాచరణ ప్రణాళికలను ఈనెల 30వ తేదీలోగా తయారు చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆపద మిత్ర వాలంటీర్స్, ఎన్‌డీఆర్ఎఫ్ సహాయంతో తో సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వరద నియంత్రణ కట్టలు, చిన్న-మధ్య తరహా కాల్వలు, వర్షపు నీటి డ్రెయిన్‌లు మొదలైన వాటిని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రతి మండలానికి వరద ప్రతిస్పందన ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. వరదల సమయంలో బాధితుల్ని తరలించేందుకు మార్గాలు, రిలీఫ్ క్యాంపుల ప్రదేశాలు, సంప్రదించవలసిన నెంబర్లు మొదలైనవి ఉండాలన్నారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, అత్యవసర, పొడి ఆహార కిట్లు ముందే సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొబైల్ వైద్య బృందాలను, అవసరమైన మందులు, నీటి శుద్ధి మాత్రలు, పారిశుధ్య కిట్లు వంటివి తగిన మొత్తంలో అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ హరీష్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయతీరాజ్ కమిషనర్ సృజన, సిపిడిసిఎల్ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి గోపి. ఐఎండి ప్రధాన అధికారి డాక్టర్ కె నాగరత్నం, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల్, ములుగు, నిర్మల్, వనపర్తి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.



రాజోలి ఎస్ఐపై వేటు

ఎస్‌పి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉన్నతాధికారుల ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో ఎలాంటి విచారణ జరపకుండా దాడి ఘటనలో అత్యుత్సాహం ప్రదర్శించిన ఎస్ఐ జగదీష్‌పై వేటుపడింది. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు ఆయన్ని ఎస్‌పి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్ద ధన్వాడలోని ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో ముందు నుంచి రాజోలి ఎస్ఐ రైతులకు వ్యతిరేకంగా అత్యుత్సాహం ప్రదర్శించినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ నెల 4న రైతుల ఆందోళన సందర్భంగా జరిగిన ఘటనకు ఎస్ఐ ప్రవర్తనే ముఖ్య కారణంగా తెలుస్తోంది. ఘటన జరిగిన రోజు ఉదయం గ్రామంలోకి వెళ్లి రైతులను రెచ్చగొట్టినట్టు తెలుస్తోంది. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ఎస్ఐ ముందు నుంచి అత్యుత్సాహం ప్రదర్శించినట్టు రైతులు అంటున్నారు. ఘటన తీవ్రతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా.. రైతు నాయకులను బెదిరించడం, గ్రామాల్లోకి వెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలకు ఎస్ఐ పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో జూన్ 4న జరిగిన ఘటనపై ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి విచారణ జరపకుండా రైతులపై కేసులు నమోదు చేశారని పైఅధికారులు గుర్తించారు. ఈ కేసులో 12 మంది రైతులు రిమాండ్ అయ్యారు. మరికొందరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. రాజోలి ఇథనాల్ ఫ్యాక్టరీ అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కావడంతో ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నది. ఈ ఘటనకు అన్నివిధాల కారణమైన రాజోలి ఎస్ఐపై చర్యలు తీసుకోవాల్సిందిగా నిర్ణయించిన నేపథ్యంలో ఆయన్ని ఎస్పీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోలీస్ అధికారుల నిర్ణయం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమాయక రైతులపై అకారణంగా నమోదు చేసిన కేసుల్ని ఎత్తివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న మోడీ

పెండింగ్ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపితో దేశానికి ప్రమాదకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతోందన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను బిజెపి ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ఓట్ల కోసం కులాల మధ్య, మతాల మధ్య వైశ్యామ్యాలు సృష్టిస్తోందన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ చెబుతున్నా.. కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపకుండా ఏకపక్షంగా కాల్పులకు తెగబడుతోందన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతి ఆరోపణలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. పెండింగ్‌లో ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని కోరారు. రైతాంగానికి వెంటనే రైతు భరోసా జమ చేయాలన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న దేశవ్యాప్తంగా పాలస్తీనాకు సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించాలని సిపిఎం కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందని చెప్పారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగారపు పాండు, మట్టిపల్లి సైదులు, కోట గోపి తదితరులు ఉన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

ఉజ్జీవన్ సేవింగ్ ఖాతాదారులకు 'రివార్డ్స్'

బెంగళూరు : ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బి) కొత్తగా ఉజ్జీవన్ రివార్డ్సను ప్రోగ్రాంను ప్రారంభించినట్లు తెలిపింది. తమ సేవింగ్ ఎకౌంట్ ఖాతాదారులకు డిజిటల్ లావాదేవీలపై రివార్డ్సను అందించే లక్ష్యంతో దీన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొంది. తమ ఖాతాదారులకు వ్యక్తిగత బ్యాంకింగ్ సేవలను విస్తరించడమే ఈ ప్రోగ్రాం లక్ష్యమని పేర్కొంది.

నేడు సిపిగెట్ నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరంలో వివిధ విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ పిజి ఎంట్రెన్స్ టెస్ట్ (సిపిగెట్) నోటిఫికేషన్ శుక్రవారం విడుదల కానుంది. ఈ నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ఎం కుమార్ హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విడుదల చేస్తారని సీపీగెట్ కన్వీనర్ ఐ పాండురంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విసిలు టి రమేష్; సిహెచ్ గోపాల్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రాథోడ్, మల్లేశం, విజ్జులత పాల్గొంటారని పేర్కొన్నారు.

చేనేత కళా నైపుణ్యం ఎంతో గొప్పది


- పోచంపల్లిని సందర్శించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత కళా నైపుణ్యం ఎంతో గొప్పదని, పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులు ఒక కళ మాత్రమే కాదని, గుర్తింపునకు చిహ్నం అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి చేనేత కార్మికుల గృహాలను గవర్నర్ పరిశీలించారు. ఇక్కత్ చేనేత కార్మికులతో మాట్లాడి, పోచంపల్లి టూరిజం టెక్స్‌టైల్ పార్కులో పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులను పరిశీలించారు. చేనేత కార్మికుల సంక్షేమం, వారి స్థితిగతులు, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గవర్నర్ టెక్స్‌టైల్ పార్కు సమావేశ మందిరంలో నేత కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఇటీవల ప్రపంచ సుందరీమణుల సందర్శనతో 30 శాతం అమ్మకాలు పెరిగాయని తెలియడం సంతోషమన్నారు. పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులను ఎలా తయారు చేస్తారో తాను స్వయంగా చూసి తెలుసుకున్నానన్నారు. మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించినట్టయితే చేనేత కార్మికులను కాపాడిన వారమవుతామన్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అన్ని రకాలుగా అవకాశాలు కల్పిస్తూ ఆదుకుంటున్నదని, త్రిఫ్ట్ స్కీమ్, ఇన్సూరెన్స్ స్కీమ్, రుణమాఫీ, నేతన్న భరోసా, వంటి పథకాల ద్వారా సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం పోచంపల్లి రా మెటీరియల్‌ను రూ. 6 కోట్లలతో సేకరిస్తున్నట్టు తెలిపారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గవర్నర్ రాకతో పోచంపల్లికి మరింత ప్రాచుర్యం వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం యాదాద్రి భువనగిరి జిల్లాకు త్రిఫ్ట్ పథకం కింద రూ.90 కోట్లు ఇచ్చిందని, రుణమాఫీ కింద ఆర్థిక సహాయం ఇవ్వనుందని, నేతన్న భరోసా, నేతన్న బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.. గవర్నర్ నేతన్నలను ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఐఐటి, ఎన్ఐటి ద్వారా మరింత మెరుగైన విధంగా పోచంపల్లి ఉత్పత్తులను పెంపొందించుకునేందుకు అవకాశాలున్నాయన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం అంజయ్య మాట్లాడుతూ.. పోచంపల్లి చేనేత ఉత్పత్తులు బాగున్నాయని, అయితే మార్కెటింగ్ సరిగాలేదని, ఈ సమస్యను పరిష్కరిస్తే నేత కార్మికులు బాగుపడతారని చెప్పారు. మరో పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్ మాట్లాడుతూ.. పోచంపల్లి గ్రామం ఇక్కత్‌కు మాత్రమే ప్రసిద్ధి కాదని, ఇది నాలుగు రకాల సబ్జెక్టులతో ముడిపడి ఉందన్నారు. నేత, డయింగ్, కలర్ అన్నిరకాల పరిజ్ఞానం ఉన్న కార్మికులు ఇందులో ఉన్నారన్నారు. అంకం పాండు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల వల్ల నేత కార్మికులకు ఆత్మస్థైర్యంతోపాటు, జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. ఈ సందర్భంగా నేత కార్మికులు ఉపేందర్, భాగ్యలక్ష్మి, యాదగిరికి నేతన్న రుణాల కింద రూ. ఐదు లక్షల చెక్కులను రాష్ట్ర గవర్నర్ పంపిణీ చేశారు. నేతన్న పొదుపు పథకం కింద యాదాద్రి భువనగిరి జిల్లా మొత్తానికి రెండు కోట్ల పదిహేను లక్షల 25 వేల రూపాయల చెక్కును నేత కార్మికులకు అందజేశారు. డిసిపి ఆకాంక్ష యాదవ్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఓఎస్‌డి భవాని శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, ఎసిపి మధుసూదన్ రెడ్డి ఎస్ఐ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.


సమావేశ మందిరంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



నిరసన తెలుపుతున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

గురుకులాల సమస్యలను పరిష్కరించాలి

- కార్యదర్శి అలుగు వర్షిణీని విధుల నుంచి తొలగించాలి
- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, లక్ష్మణ్ డిమాండ్
- సంక్షేమ భవన్ ముట్టడి ఉద్రిక్తం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గురుకుల విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్న కార్యదర్శి అలుగు వర్షిణీని విధుల నుంచి తొలగించాలని కోరారు. గురుకులాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో సంక్షేమ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లకార్డులను ప్రదర్శించి నిరసన చేపట్టారు. అప్పటికే పోలీసులు భారీగా మోహరించారు. సంక్షేమ భవన్‌లోకి ఏఐఎస్ఎఫ్ నేతలు, కార్యకర్తలు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో వారి మధ్య తోపులాట, ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈ సమయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి హైదరాబాద్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అంతకుముందు మణికంఠరెడ్డి, లక్ష్మణ్ మాట్లాడుతూ గురుకులాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 12 ఎస్‌సి గురుకుల జూనియర్ కాలేజీల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని చెప్పారు. అద్దె భవనాల్లో ఉన్న వాటికి అద్దె చెల్లించకపోవడంతో యజమానులు తాళాలు వేస్తున్నారని అన్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమస్యలను పరిష్కరించకుంటే దశలవారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు గ్యార నరేష్, రెహమాన్, కాసోజు నాగజ్యోతి, నాయకులు చైతన్య యాదవ్, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, భాషాబోయిన సంతోష్, ముదిగొండ మురళీకృష్ణ, దత్తురెడ్డి, వలమల ఆంజనేయులు, హరీశ్, చరణ్, అరుణ్ పాల్గొన్నారు.

వచ్చే మూడ్రోజులు వానలు

పజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు వానలు పడే అవకాశముందనీ, పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని వాతావరణ శాఖ ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ఏడు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మంచిర్యాల జిల్లాలున్నాయి. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశాలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయాల్లో పలుచోట్ల తేలికపాటి వర్షం పడే అవకాశముంది. గురువారం ఉదయం 8:30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు రాష్ట్రంలో 400కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. జగిత్యాల, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, రంగారెడ్డి, జనగాం, వికారాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షం పడింది. జగిత్యాల జిల్లా బీమారం మండలం మన్నెగూడెంలో అత్యధికంగా 8.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

ఆటో మీటర్ ఛార్జీల పెంపునకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఆటోమీటర్ చార్జీల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల యూనియన్ల జెఎసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేనిని జేఏసీ నాయకులు సన్మానించారు. కూనంనేని మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డుతోపాటు పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని చెప్పారు. జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా ఆటో రిక్షాలకు అనుమతి ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఉత్తర్వులు జారీ చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

బిఆర్ఎస్ హయాంలో సెరికల్చర్ శాఖ నిర్లక్ష్యానికి గురైంది

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సెరికల్చర్ శాఖ నిర్లక్ష్యానికి గురైందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో రైతు కమిషన్‌తో సెరికల్చర్ శాఖ అధికారులు సమావేశమయ్యారు. సెరికల్చర్ శాఖ నిర్లక్ష్యానికి గురైందంటూ రైతు కమిషన్‌కు అధికారులు వివరించారు. పదేండ్లలో నియామకాలను చేపట్టకపోవడం, నిధులు కేటాయించకపోవడం తో అది నిర్వీర్య పరిస్థితికి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సెరికల్చర్‌ను ఉద్యాన శాఖలో కలపడం వల్ల దాని మనుగడకే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో కూడా అధికారుల కొరత తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్రంలో పట్టు పురుగుల సాగులో మంచి లాభాలున్నా.. దాన్ని బీఆర్ఎస్ పట్టించుకోలేదని విమర్శించారు. పట్టుపరుగుల సాగుతో రైతులు లాభపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సెరికల్చర్ శాఖలో 60 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారని తెలిపారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ద్వారా పట్టుపురుగుల సాగుకు నిధులు కూడా తీసుకోవచ్చునని చెప్పారు. తెలంగాణలో సిల్క్ దుస్తువుల డిమాండ్ ఉందన్నారు. సమావేశంలో రైతు కమిషన్ సభ్యులు గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి, గడుగు గంగాధర్ ఉన్నారు. అధికారులు చెప్పిన విషయాలను ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతామని కోదండరెడ్డి భరోసా ఇచ్చారు.

విమాన ప్రమాదంపై సిఎం రేవంత్ విచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిన దుర్ఘటనపై ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు విమానంలో దాదాపు 200 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారనే సమాచారం తెలియటంతో అందరూ సురక్షితంగా ఉండాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు. బాధితులను, వారి కుటుంబాలను ఆదుకోవడానికీ, వీలైనంత వేగంగా సమర్థవంతంగా సహాయక చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

విమాన ప్రమాదంపై కూనంనేని దిగ్భ్రాంతి

అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విమానం పడిన భవనంలో నివసిస్తున్న మెడికల్ విద్యార్థులు సైతం చనిపోవడం తీవ్రంగా కలచివేసిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చనిపోయిన ప్రయాణికులకు, విద్యార్థులకు, సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇప్పటికైనా దేశ పౌర విమానయాన శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.


మహాసభలో మాట్లాడుతున్న పోతినేని సుందర్శన్‌రావు

రైతులు సంఘటితంగా ఉద్యమించాలి

- ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం : పోతినేని సుదర్శన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతులు సంఘటితంగా ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. గురువారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలోని పిఎస్ఆర్ గార్డెన్‌లో తెలంగాణ రైతు సంఘం జిల్లా 2వ మహాసభను నిర్వహించారు. ముందుగా గోవిందరావుపేటలో రైతులు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం పిఎస్ఆర్ గార్డెన్‌లో సంఘం సీనియర్ నాయకులు గుండు సత్యనారాయణ జెండావిష్కరణ చేశారు. చిట్టెం ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన మహాసభలో పోతినేని మాట్లాడారు. పార్లమెంట్‌లో గిట్టుబాటు ధర చట్టం కోసం రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నా కేంద్రం కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను రద్దుచేసి నూతన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా పేరుతో కార్పొరేట్లకు అనుకూలంగా చట్టం తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం ద్వారా రైతుల భూ కమతాలను కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి పూర్తిగా అమలుచేయలేకపోయిందని ఆరోపించారు. రైతులు కాస్తు చేస్తున్న భూములన్నింటికీ రైతు భరోసా ఇస్తానని చెప్పి అధికారంలోకి రాగానే మోసం చేశారని అన్నారు. జిల్లాలో వడగండ్ల వాన పడి రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని, వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలతో మొక్కజొన్న రైతులు నష్టపోయారని, వారికి ఎకరాకు లక్ష రూపాయలు చెల్లించాలని కోరారు. జిల్లాలో సాగునీటి సౌకర్యం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. జిల్లాలో ఇంకా 40 వేల ఎకరాల పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వలేదని, సర్వే చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ మహాసభలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, ఎండి గఫూర్ పాషా, తీగల ఆదిరెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, సోమ మల్లారెడ్డి, గుండు లెనిన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు యునిఫారాలు అందజేస్తున్న మంత్రి సీతక్క, ప్రభుత్వాధికారులు

ఉత్సాహంగా పాఠశాలల పున:ప్రారంభం

- తొలిరోజే 54 లక్షల పాఠ్యపుస్తకాలు, 20 లక్షల యూనిఫారాల పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాఠశాలలు గురువారం నూతనోత్సాహంతో పున:ప్రారంభమయ్యాయి. పాఠశాలలు తెరిచిన మొదటిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించిన విషయం తెలిసిందే. ముందుగా నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం పాఠశాలలు తెరిచే నాటికి పాఠశాలలకు పుస్తకాలు, యూనిఫారాలు చేరేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. దీంతో ఆ లక్ష్యం నెరవేరింది. పాఠశాలలు తెరిచే నాటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27,852 ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకుల పాఠశాలలకు 1,01,66,220 పాఠ్యపుస్తకాలు చేరాయి. ఇందులో తొలిరోజు పాఠశాలలకు హాజరైన సుమారు 8,33,398 లక్షల మంది విద్యార్థులకు 54,52,708 పుస్తకాలను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అందజేశారు. ఈ ఏడాది మొత్తం 20,30,667 మంది విద్యార్థులకు యూనిఫారాలను అందజేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది. తొలి రోజు పాఠశాలలకు హాజరైన 8,33,398 విద్యార్థులకు ఒక జత యూనిఫారాలను ఉపాధ్యాయులు అందజేశారు. రెండో జతను సాధ్యమైనంత త్వరలో అందజేయనున్నట్టు ప్రకటించింది. ఈ ఏడాది నుంచి పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ)ని ఒక సబ్జెక్ట్‌గా బోధిస్తుండడంతో ఆ సబ్జెక్టుకు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేయనున్నారు. గతేడాదే సమారు 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించడం, 21,419 మంది టీచర్లకు పదోన్నతులు ఇవ్వడం, 34,700 మందికి బదిలీలు పూర్తి చేయడంతో ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల నమోదు, బోధనపై దృష్టిసారించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నేతృత్వంలోనే గతేడాది అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనను ప్రభుత్వం పూర్తి చేసింది. పుస్తకాలు, యూనిఫారాల పంపిణీ, ఇతర కార్యకలాపాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు రోజువారీ సమీక్ష చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

బస్ పాసుల ఛార్జీల పెంపు నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలి

- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు
- డాక్టర్ దిడ్డి సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బస్ పాసుల చార్జీల పెంపు నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన ఉచిత విద్య, వైద్యాన్ని ప్రజలకు ప్రభుత్వం అందించడం లేదని తెలిపారు. చదువుల కోసం బస్సుల్లో వెళ్లే విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పిస్తే దేశాభివద్ధికే ప్రయోజనం చేకూరుతుందని సూచించారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం లేదని, కనీసం పాసులకు ఛార్జీలు పెంచకుండా చూడాలని కోరారు. 20 నుంచి 30 శాతం పెరిగిన ఛార్జీలతో, ఇప్పటికే పెరుగుతున్న నిత్యావసర ధరలతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి వర్గాలపై మరింత భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద హీరోల సినిమాలకు పన్నుల మినహాయింపు, కార్పొరేట్ కంపెనీలకు పన్నుల రాయితీలు, కోట్లాది రూపాయల విలువైన భూముల అప్పగిస్తున్న ప్రభుత్వం పేద విద్యార్థులపై భారం మోపుతున్నదని విమర్శించారు. మహిళకు ఉచిత బస్సు ప్రయాణం అంటూనే బస్సు ఛార్జీలను పెంచి దొడ్డి దారిన వసూళ్లు చేసుకుంటున్నట్టుందని ఎద్దేవా చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లోని బస్ భవన్ వద్ద నిరసన కార్యక్రమంతో పాటు రాష్ట్రంలోని పలు కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నట్టు తెలిపారు.

విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో

రైతులు అప్రమత్తంగా ఉండాలి

- లైసెన్స్ కలిగిన డీలర్ వద్దే ఎరువులు కొనుగోలు చేయాలి : శోభన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వానాకాలం సాగుకు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వివిధ ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దరావత్ మోతీరాం నాయక్, జిల్లా నాయకులు గైని సాయిలు, ఎ.సుధాకర్, కె బన్సీ నాయక్, మలోత్ కిషన్, మలోత్ గోవర్ధన్‌తో కలిసి శోభన్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన విత్తన కంపెనీలతో రైతులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లైసెన్స్ కలిగిన డీలర్ నుంచే ఎరువులు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనోత్పత్తి రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో విత్తన చట్టం లేకపోవడం దారుణమన్నారు. అన్ని పంటల విత్తనాలు కలిసి రాష్ట్రానికి 20 లక్షల క్వింటాళ్లు కావాలన్నారు. రాష్ట్రంలో 444 విత్తన కంపెనీలు, 467 సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయని, వీటిని వ్యవసాయ శాఖ నియంత్రించలేకపోతున్నదని అన్నారు. నాణ్యత లేని విత్తనాలను సంస్థలు అమ్మడంతో ఏటా 5 లక్షల నుంచి 6 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. 5 సంవత్సరాలుగా రుణ ప్రణాళికను ప్రకటించడం గానీ, అమలు జరపడం గానీ చేయలేదన్నారు. ఎకరాకు రూ.7,500 రైతు భరోసా ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6000కు తగ్గించిందని తెలిపారు. అది కూడా 2024 రబీ సీజన్‌లో ఇవ్వలేదని, 2025 యాసంగిలో 53.4 లక్షలమందికి 72 లక్షల ఎకరాలకు రూ.4,366 కోట్లు



ఎరువుల కొనుగోలు కేంద్రాలను సందర్శించిన మూడ్ శోభన్

మాత్రమే చెల్లించారని అన్నారు. ఆ తర్వాత చెల్లింపులు చేయలేదన్నారు. 2025-26 వానాకాలం ప్రారంభమవుతున్నదని, 70 లక్షల మంది రైతులకు రూ.7,320 కోట్లు రైతు భరోసా కింద చెల్లించాల్సి ఉందని తెలిపారు. 18 నుంచి 59 ఏండ్ల వయస్సు కలిగిన రైతులకు మాత్రమే రూ.5లక్షల బీమా వర్తింప చేస్తున్నారని, దీన్ని 65 ఏండ్లకు పెంచాలని కోరారు. బీమా ప్రీమియం వల్ల కంపెనీలకు వేలకోట్ల లాభాలు వస్తున్నాయని, కాబట్టి ప్రభుత్వమే ఒక శాఖను ఏర్పాటుచేస్తే ప్రస్తుతం చెల్లించే ప్రీమియంలో సగంతో బీమా పరిహారం చెల్లించొచ్చని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ శాఖ పనితీరు ప్రణాళికా బద్ధంగా లేదని విమర్శించారు. ప్రభుత్వ బడ్జెట్ అంచనాల ప్రకారం 2024-25లో 35.25 లక్షల మంది రైతులకు రూ.90,792 కోట్ల పంట రుణాలు లక్ష్యంగా నిర్ణయించి రూ.60,713 కోట్లు (66.87శాతం) మాత్రమే పంపిణీ చేసినట్టు చెప్పారు. మొత్తం 72 లక్షల మంది రైతు కమతాలు ఉండగా బ్యాంకులు 45 లక్షల మందికి మాత్రమే రుణ సౌకర్యం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ విధానం సరిచేసి అందరికీ పంట రుణాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం వారికున్న భూమి మేరకు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో చేరుతున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారని, 2025-26లో మొత్తం రైతుల పంటల ఆధారంగా 2025 జూన్ 15 నాటికి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకు రుణాలతో సంబంధం లేకుండా రైతులందరికీ పంటల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ మినహా మిగిలిన పంటలకు నిర్ణయించిన బోనస్ ఇవ్వడం లేదన్నారు. జీలుగు విత్తనాల ధరలు రూ.1124 నుంచి రూ.2137 పెంచిందని అన్నారు. వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులను రక్షించాల్సిన ప్రభుత్వం భారం మోపుతుందని అన్నారు. కార్పొరేట్లకు లాభాలు చేయడం కోసమే కనీస మద్దతు ధర నాటకమడుతుందని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సూచనలను గత 11 సంవత్సరాలుగా పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తన చట్టాన్ని అమోదించాలని, వ్యవసాయోత్పత్తుల నిల్వకు తగిన గోదాములను నిర్మించాలని డిమాండ్ చేశారు.

జవహర్ నగర్‌లో విషాదం

క్వారీ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్వారీ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎపిలోని గుంటూరు జిల్లాకు చెందిన ధుదుకురి స్వాతి తన కుమారుడు దుర్గా ప్రసాద్ (11)తో కలిసి అనారోగ్యంతో ఉన్న అత్త యాదమ్మను చూడడానికి జవహర్ నగర్‌లోని అరుంధతి నగర్‌కు నెల క్రితం వచ్చింది. కాగా ఈ నెల 4న అదే ప్రాంతానికి స్వాతి బంధువు అంజమ్మ కూడా తన కుమారుడు మదసు సుబ్రహ్మణ్యం (8)తో వచ్చింది. బుధవారం ఉదయం ఇద్దరు పిల్లలు దుర్గా ప్రసాద్, సుబ్రమణ్యం ఆడుకుంటూ తప్పిపోయారు. వారి కోసం కుటుంబ సభ్యులు చుట్టు పక్క ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో గురువారం ఉదయం స్వాతి జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా సిఆర్‌పిఎఫ్ క్యాంప్ సమీపంలోని బండ బావి క్వారీ గుంతలో చిన్నారుల మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను బయటకు తీసి, పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో అరుంధతి నగర్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

క్వారీ చుట్టూ రక్షణ చర్యలు తీసుకోవాలి

బండ బావి క్వారీ గుంతలో పడి గతంలోనే చాలా మంది ప్రాణాలు కోల్పోయినట్టు స్థానికులు చెబుతున్నారు. గతంలో ఈ క్వారీ చుట్టూ కంచే ఏర్పాటు చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని, ఇప్పటికైనా స్పందించి కంచే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గొల్ల కురుమలకు మంత్రి ఇవ్వాలి

- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి రాష్ట్రంలో గొల్ల, కురుమలకు మంత్రి పదవులు ఇచ్చేవారనీ, ఆ అనవాయితీని కొనసాగించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. గొల్ల, కురుమలకు మంత్రి పదవి, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్సీ, ఐదుగురికి కార్పొరేషన్ చైర్మన్లు, ఐదు కమిషన్ సభ్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్, మూడు ఉపాధ్య పదవులు, ఎనిమిది ప్రధాన కార్యదర్శి పదవులు ఇవ్వాలని మహేష్‌కుమార్‌ను కోరారు.

విమాన ప్రమాదంపై మంత్రి దామోదర దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న వారంతా సురక్షితంగా బయటపడాలని మంత్రి ఆకాంక్షించారు. బాధితులను రక్షించేందుకు సహాయక చర్యలు విస్తృతం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి, గుజరాత్ ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

హృదయాన్ని కలిచివేసింది: మహేష్‌కుమార్‌గౌడ్

గుజరాత్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే ప్రయత్నంలో ఉన్న విమానం జనావాసాలపై కుప్పకూలిన విషాద ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన హృదయాన్ని కలిచివేసిందనీ, ప్రమాదంలో ప్రయాణికులు, మెడికల్ సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని తెలిపారు. మృతుల మరణం పట్ల ఆయన సంతాపం తెలిపారు. వారికి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని గుజరాత్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రేపు ఎఎస్‌బిఎల్ కొత్త వెంచర్ బ్రాడ్‌వే ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

రియల్ ఎస్టేట్ సంస్థ ఎఎస్‌బిఎల్ నగరంలో మరో ప్రీమియం రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టును అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 14న ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో 'బ్రాడ్‌వే' పేరుతో కొత్త ప్రాజెక్టును ప్రారంభిస్తోన్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రాజెక్టు 2029 డిసెంబరు కల్లా పూర్తవుతుందనితెలిపింది. దీన్ని రూ.900 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేస్తోన్నట్లు తెలిపింది. ఈ ప్రీమియం నివాసం వెంచర్ కోసం ఇప్పటికే రూ.400 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. ఇందులో రూ.275 కోట్లు మోతీలాల్ ఓస్వాల్ గ్రూప్ నుంచి సమీకరించినట్లు కంపెనీ తెలిపింది. ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో జీ ప్లస్ 50 ఫ్లోర్లలో 885 లగ్జరీ ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు నిర్మించనుంది. అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ఈ వెంచర్‌లో ఒక్కో ఫ్లాటు కనీస ధర రూ.2.5 కోట్ల వరకు ఉంటుందని కంపెనీ తెలిపింది.

అహ్మదాబాద్ ప్రమాద ఘటన మృతులకు ఐలు సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది.

గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ రూపానితో పాటు అనేక మంది భారతీయులు, బ్రిటిష్ పౌరులు, ప్రమాద ఘటనలో వైద్యులు, సిబ్బంది మరణించడం బాధాకరమని ఐలు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు విద్యాసాగర్, బార్ కౌన్సిల్ మెంబర్, రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె పార్థసారథి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాద ఘటనలో మరణించిచన వారి బంధువులకు సానుభూతి తెలిపారు. బాధితులకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే తీసుకోవాలని కోరారు.

లెక్సస్ ఎల్‌ఎక్స్ 500డి డెలివరీలు షురూ..

హైదరాబాద్ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ లెక్సస్ తన ఎల్‌ఎక్స్ 500డి డెలివరీలను ప్రారంభించినట్లు తెలిపింది. ఆఫ్-రోడ్ సామర్థ్యం, లగ్జరీ, అధునాతన సాంకేతికతను మిళితంతో దీన్ని ఆవిష్కరించామని లెక్సస్ ఇండియా ప్రెసిడెంట్ హకరు ఇకెయాచీ పేర్కొన్నారు. దీనికి గరిష్టంగా ఎనిమిదేళ్లు లేదా 1.60 లక్షల కిలోమీటర్ల వరకు ఉచిత సర్వీసింగ్‌ను అందిస్తున్నామన్నారు.

జైలు జీవితం తప్పదు

- కెటిఆర్‌కు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్లు మంత్రిగా ఆయన చేసిన తప్పులకు జైలు జీవితం అనుభవించక తప్పదని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాజీ మంత్రి కేటీఆర్‌ను హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే, ప్రజలే బట్టలూడ దీసి కొడతారని హెచ్చరించారు. బిఆర్‌ఎస్ తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరిపైన కక్షసాధింపు చర్యలకు పాల్పడబోదని తెలిపారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఇష్టానుసారంగా చేసిన తప్పులపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అసెంబ్లీలో కెటిఆర్ సంస్కారం గురించి నీతులు చెప్పారనీ, ఆనాడు నీతులు చెప్పిన ఆయన ఇప్పుడు ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు ఎలా చేస్తారని ప్రశ్నించారు.

విచారణకు హాజరయ్యారు సరే హైడ్రామా ఏంటీ? : కోదండరెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, అక్రమాలు జరిగాయనే అనుమానంతో విచారణ కమిషన్ ముందుకు కెసిఆర్ హాజరయ్యారు సరే.. బీఆర్‌కే భవన్ వద్ద కేసీఆర్ హైడ్రామా ఏంటని రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి ప్రశ్నించారు. విచారణకు వేలాది మంది జనంతో రావడమేంటని ప్రశ్నించారు. కమిషన్ బెదిరించే ప్రయత్నం చేశారా? అని నిలదీశారు. కేంద్రం నియమించిన కమిషన్‌ను గౌరవించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కెటిఆర్ వీధి రౌడీలను మించిపోయారు : పటేల్ రమేష్‌రెడ్డి

మాజీ మంత్రి కెటిఆర్ వీధి రౌడీలను మించిపోయారని టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి విమర్శించారు. బిఆర్‌ఎస్‌కు అధికారం పోయిందన్న అక్కసుతో ఆయన సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కెటిఆర్ పద్ధతి మార్చుకోకపోతే ప్రజలు తిరగబడుతారని హెచ్చరించారు. రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ సిఎంపై కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆయన హెచ్చరించారు.

ప్రారంభం రోజే పాఠశాలలకు తాళాలు

- అద్దె ఇవ్వలేదని మైనారిటీ గురుకులానికి తాళం
- హైదరాబాద్ కలెక్టర్ హామీతో తాళం తీసిన యజమాని
- బిల్లులు రాలేదని ఆకునూరు ఉన్నత పాఠశాలకు తాళం వేసిన కాంట్రాక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేసవి సెలవులు ముగిసి.. పాఠశాలలు పున:ప్రారంభమైన రోజే కొన్ని చోట్ల అనూహ్య ఘటనలు జరిగాయి. అద్దె కట్టలేదని, బిల్లులు చెల్లించలేదని యజమాని, కాంట్రాక్టర్ పాఠశాలలకు తాళాలు వేశారు. దాంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆరుబయటే ఉండిపోవాల్సి వచ్చింది. చివరకు ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో తాళాలు తీశారు. ఈ ఘటనలు హైదరాబాద్, సిద్దిపేట జిల్లాల్లో జరిగాయి. వివరాలిలా ఉన్నాయి..

హైదరాబాద్ ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని బాగ్‌లింగంపల్లిలో మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో 371 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ భవనానికి ప్రభుత్వం నెలకు రూ.6.5 లక్షల అద్దె చెల్లిస్తోంది. అయితే, 13 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో భవన యజమాని సాహిల్ కొఠారి పాఠశాల గేటుకు తాళం వేశారు. గురువారం తాళం తీయడానికి వచ్చిన



తాళం వేసి ఉన్న పాఠశాల ముందు ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రిన్సిపల్ వాణిశ్రీకి ఆయన అడ్డుతగిలారు. 13 నెలలుగా ప్రభుత్వం గురుకుల భవనాలకు అద్దె చెల్లించడం లేదని, అద్దె చెల్లించకపోతే లోపలికి అనుమతించేది లేదని భీష్మించుకొని అక్కడే కూర్చున్నారు. సమాచారం అందుకున్న హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, అశోక్ పాఠశాల ప్రాంగణం వద్దకు చేరుకొని ప్రిన్సిపల్, భవన యజమానితో చర్చించారు. విద్యార్థులను రోడ్లపై ఉంచొద్దని, వెంటనే తాళాలు తెరవాల్సిందిగా కోరారు. ఎంతకూ యజమాని వినకపోవడంతో అధికారులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి సమాచారం అందించారు. ఆయన వెంటనే సంబంధిత బిల్డింగ్ యజమానితో సంప్రదింపులు జరిపి 13 నెలల అద్దెకుగాను ఐదు నెలలు అద్దె వెంటనే చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సదరు భవన యజమాని తాళం తీశారు. విద్యార్థులను నడిరోడ్డుపై నిలబెట్టిన భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు.

చేర్యాలలో..

పాఠశాల అభివృద్ధి కోసం చేసిన పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడి పున:ప్రారంభం రోజే పాఠశాలకు తాళం వేశాడు. సిద్దిపేట జిల్లా జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండేళ్ల కిందట మన ఊరి-మన బడి నిధుల ద్వారా డైనింగ్ హాల్, టైల్స్, ఎలక్ట్రిషన్ వర్క్‌ను మాజీ ఎస్‌ఎంసీ చైర్మెన్, కాంట్రాక్టర్ కోతి దాసు చేపట్టారు. ఇందుకు సంబంధించిన బిల్లులు రూ.8.50 లక్షలు రావాల్సి ఉన్నది. ఈ విషయమై అనేకసార్లు జిల్లా అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ బిల్లులు మంజూరు చేయలేదని, అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందని అతడు వాపోయాడు. ఈ క్రమంలో పాఠశాల పున:ప్రారంభం రోజు హైస్కూల్‌కు తాళం వేశాడు. చేర్యాల ఎస్ఐ పి.నీరేష్ పాఠశాలకు చేరుకొని అతనితో మాట్లాడారు. వెంటనే డీఈఓ, ఏసీపీలతో మాట్లాడించి సర్ది చెప్పడంతో కాంట్రాక్టర్ తాళం తీశారు.

జూన్ 14, 15 తేదీల్లో ఫిస్టులాకాన్ -2025

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఈ నెల 14, 15 తేదీల్లో ఫిస్టులాకాన్ -2025 పేరుతో జాతీయ సదస్సు, ప్రత్యేక శస్త్రచికిత్స శిబిరం జరగనున్నది. ఈ మేరకు ఫిస్టులాకాన్-2025 ఆర్గనైజింగ్ చైర్మెన్, డాక్టర్ పల్లం ప్రవీణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రి జనరల్ సర్జరీ విభాగం, అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా-తెలంగాణ చాప్టర్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సు డాక్టర్ పల్లం ప్రవీణ్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ డి.మోహన్ దాస్, ప్యాట్రన్ డాక్టర్ ఉమాకాంత్ గౌడ్ నాయకత్వం వహిస్తున్నారు. కార్యక్రమంలో నిపుణుల ఉపన్యాసాలు, ప్యానల్ చర్చలు, ప్రత్యక్ష శస్త్రచికిత్స, ప్రదర్శన నిర్వహించబడతాయని చెప్పారు. కార్యక్రమానికి వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ నరేందర్ కుమార్ ప్రారంభిస్తారనీ, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రాజారావు, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్ పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా ప్రముఖ సర్జన్లు, శిక్షణలో ఉన్న డాక్టర్లను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా ఫిస్టులా ఇన్ అనో చికిత్సపై చికిత్సపై నూతన అవగాహన, నైపుణ్యాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో జాతీయ సదస్సును తలపెట్టారు. ఫిస్టులా అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహించడం తొలిసారి అని ప్రవీణ్ తెలిపారు.

రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ సర్కార్

- రుణమాఫీ కోసం సగం మంది ఎదురుచూపులు : ఎమ్మెల్యే పాయల్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. రుణమాఫీ కోసం ఇంకా సగం మంది రైతులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుభరోసా ఇవ్వట్లేదన్నారు. స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ మీటింగ్ అయిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ రుణాలుగా ఎన్ని వేల కోట్ల రూపాయలు లక్ష్యంగా నిర్దేశించబడ్డాయి? ఆ టార్గెట్ ఎంత? ఎంత వరకు అమలైంది? డిఎల్‌బిసి మీటింగ్ జరగని జిల్లాలెన్ని అని ప్రశ్నించారు. ఫసల్‌బీమా యోజన పథకాన్ని అమలు చేస్తామని కూడా రేవంత్‌రెడ్డి సర్కారు మోసం చేసిందని విమర్శించారు. కాళేశ్వరం అవినీతిపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కెసిఆర్‌ని క్లీన్ చిట్ ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుందేమోననే అనుమానం కలుగుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా అల్లకల్లోలంగా మారిందని విమర్శించారు. మేధావులు ఓటేసి గెలిపించిన రెండు ఎమ్మెల్సీ విజయాలు కేంద్ర సహకారానికి నిదర్శనమన్నారు. కేంద్రం రాష్ట్రానికి నిధులివ్వకపోతే బిజెపికి ఆ విజయాలు ఎలా సాధ్యమయ్యేవి అని ప్రశ్నించారు. 11 ఏండ్లలో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన ప్రతి రూపాయి వివరాన్ని పుస్తక రూపంలో కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి విడుదల చేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కర్నాటకతో పాటు తెలంగాణలో కూడా కాంగ్రెస్‌కు అవకాశం లేదని సర్వేలు చెబుతున్నాయన్నారు.

రంగారెడ్డిలో మరో స్కూల్‌కు అమెజాన్ మద్దతు

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల వద్ద నూతనంగా పునరుద్ధరించిన తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు మద్దతును అందించినట్లు అమెజాన్ తెలిపింది. ఇందులో భాగంగా 250 మంది భోజనం చేయటానికి కొత్త డైనింగ్ హాల్‌ను నిర్మించినట్లు వెల్లడించింది. దీనితో పాటుగా బాస్కెట్‌బాల్ కోర్టును, కొత్త తరగతి గది ఫర్నిచర్‌ను అందించినట్లు పేర్కొంది, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్ర ప్రయోగశాలలతో సహా కీలకమైన సైన్స్ సౌకర్యాలను కల్పించినట్లు తెలిపింది. కొత్త పుస్తకాలు, ఫర్నిచర్, డిజిటల్ సాధనాలతో పాటు పాఠశాల లైబ్రరీని పూర్తిగా పునరుద్ధరించటంతో పాటుగా ఆధునిక అభ్యాసానికి మద్దతునందిస్తోన్నట్లు అమెజాన్ ఉన్నతాధికారి సాజి పికె పేర్కొన్నారు.

వర్షపు నీటితో నిండిన సెల్లార్



- పలు ఇంటర్ నెట్ షాపుల మునక, లక్షల్లో ఆస్తి నష్టం
- ఏడు ఇంజన్‌లతో నీటి తోడివేత
- చందానగర్ పరిధిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్షపునీటి కోసం నిర్మించిన కాలువను ఎత్తులో నిర్మించడం వల్ల గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి సెల్లార్‌లోకి వర్షపు నీరు చేరడంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. అధికారుల తప్పిదం వల్ల పలువురు వ్యాపారులు తీవ్రంగా నష్టపోవాల్సింది వచ్చింది. ఏడు ఇంజన్‌లతో నీటి తోడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా చందానగర్ జాతీయ రహదారి పక్కన రోడ్డు విస్తరణలో భాగంగా గంగారం వైపు నుంచి వచ్చే వర్షపు నీరు లింగంపల్లి నుంచి వెళ్లే నాలాలో కలిపేందుకు కాలువ నిర్మించారు. అలాగే, ఈ మధ్యనే నిర్మించిన ఫ్లై ఓవర్ పై నుంచి వచ్చే వర్షపు నీటిని కాలువలోకి మళ్లేలా చేశారు. కాగా, జాతీయ రహదారి పక్కనున్న సెల్లార్‌లో దివ్య నెట్, ఆల్ఫాగోల్డ్ టీ పొడి, బాలాజీ ఫుట్ వేర్, విజేత డిజిటల్ స్టూడియో, సిసి కెమెరాల షాప్, సెల్‌ఫోన్ షాప్‌లు ఉన్నాయి. కానీ పిఆర్‌కె ఆస్పత్రి వద్ద వర్షపు నీరు వెళ్లే కాలువ కొద్దిగా హైట్‌లో ఉండటంతో నీరు సాఫీగా వెళ్లలేక జాతీయ రహదారి పక్కనున్న సెల్లార్‌లోకి చేరింది.

దాంతో షాపులో ఉన్న కంప్యూటర్లు, స్కానర్లు, జిరాక్స్ మిషన్లు, ప్రింటర్లు, కొరియర్ సామగ్రి, చెప్పులు, టీ పొడి ఇలా మొత్తం నీటిలో మునిగిపోయాయి. 7 ఇంజన్లతో ఉదయం ఆరు గంటల నుంచి నీటిని తోడేయగా సాయంత్రం వరకు గానీ నీరు తగ్గలేదు. అలాగే, పీఆర్‌కే ఆస్పత్రి సెల్లార్‌లోకి కూడా నీరు చేరి వాహనాలు పాడైపోయాయి. వరుసగా ఉన్న షాపులు పూర్తిగా మునిగిపోవడంతో లక్షల రూపాయలు నష్టపోయమని దివ్య కమ్యూనికేషన్ యజమాని సతీష్ తెలిపారు. ఈ ఘటనకు ఎవరు బాధ్యత వహించాలని వారు ప్రశ్నించారు. షాపుల్లో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా మునిగి పాడయిపోయాయని, లక్షల్లో నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని షాప్ యజమానులు కోరారు.

పిడుగులు పడి ఆరుగురు గిరిజనులు మృతి

- 8 మందికి గాయాలు, రిమ్స్‌లో చికిత్స
- క్షతగాత్రులను పరామర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పిడుగులు పడడంతో ఆరుగురు గిరిజనులు మృతి చెందారు. గాదిగూడ, బేల మండలాల్లో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతోపాటు పిడుగులు పడ్డాయి. ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురు మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన వారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వివరాలిలా ఉన్నాయి..

గాదిగూడ మండలం పిప్రి గ్రామంలో పొలంలో విత్తనాలు వేస్తున్న సమయంలో వర్షంతోపాటు పిడుగు పడటంతో సిడాం రాంబాయి(45), పెందూర్ మాధవరావు (34), పెందూర్ సంజన (18), మంగు భీంబాయి (26) చనిపోయారు. వారిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ఉన్నారు. గాయపడిన హెచ్‌కె విశ్వనాథ్, పెందూర్ కైలాస్, పెందూర్ షేకు, సిడాం శంకర్, మర్సుకోల అంజు, మర్సుకోల వైశాలి, మర్సుకోల సోము, గోడాం శంభును రిమ్స్‌కు తరలించారు. మృతదేహాలను కూడా రిమ్స్‌కు తీసుకెళ్లారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలానికి ఆదివాసీ విద్యార్థి జిల్లా సంఘం అధ్యక్షులు పూసం సంతోష్ చేరుకొని కుటుంబ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

సభ్యులను పరామర్శించారు. బేల మండలం సాంగిడి గ్రామంలోనూ పిగుడుపడి గెడం నందిని (45) మృతి చెందారు. గాయపడిన గెడం సత్యవతిని రిమ్స్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఇదే మండలం సోన్‌కాస్ గ్రామంలోనూ కోవ సునిత (38) కూడా పిడుగుపాటుకు బలైంది. రిమ్స్‌లో మృతదేహాలను మాజీ మంత్రి జోగు రామన్న, సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, నాయకులు సందర్శించారు. చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. పిడుగుపాటుతో రైతులు చనిపోవడం బాధాకరమన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఒకే రోజు ఆరుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన వెంట బిఆర్‌ఎస్ నాయకులు రౌతు మనోహర్, యూనిస్ అక్బాని, తన్వీర్, రాజేష్ ఉన్నారు.

పిడుగులు పడి చనిపోయిన ఆదివాసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. పిడుగు పాటుతో చనిపోయిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన బాధితులకు రూ.పది లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిడుగుపాటుతో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని పార్టీ నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారి వెంట సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.స్వామి, నాయకులు కొట్నాక్ సక్కు, భీంరావు ఉన్నారు.